క్లుప్తంగా

ప్రతినెలా చికిత్స చేసుకోవాలి



చింతగుంటూరులో ఆరోగ్యసేవలు

గుడిపాల: మండలంలో ఉన్న గర్భవతులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతినెలా క్రమం తప్పకుండా చికిత్సలు చేసుకోవాలని వైద్యాధికారి రష్మిత కోరారు. చింతగుంటూరు గ్రామంలో గురువారం 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గర్భవతులకు 14 రకాల రక్తపరీక్షలు నిర్వహించి అవసరమైన రోగులకు మందులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు ఉచితంగా చికిత్స చేసి అన్ని వ్యాధులకు మందులు అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా చక్కెర వ్యాధి, రక్తపోటు ఉన్నవారికి నెలకు సరిపడా మందులు ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ప్రియాంక, కలైవాణి, వనజ, కోకిల పాల్గొన్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ



ప్రత్యేక అవసరాల పిల్లలతో భారతి

గుడిపాల: ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ తీసుకోవాలని జిల్లా లీగల్ సర్వీసు అథారిటీ సెక్రటరీ భారతి అన్నారు. గురువారం తుమ్మలవారిపల్లె, చెరువుముందరవూరు గ్రామాలతోపాటు నరహరిపేట పాఠశాలలోని భవిత కేంద్రంలో చదువుతున్న ప్రత్యేక అవసరాల పిల్లలకు అందిస్తున్న వసతులు, సేవలపై ఆమె ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె భోజన సౌకర్యంపై ఆరా తీశారు. పాఠశాలకు వస్తున్న పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైకల్యం ఉన్న చిన్నారుల వివరాలు అందజేయాలని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్యకు ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బాలసురక్ష కార్యక్రమ అధికారి శిరీష, డీఈఐసీ అధికారి హేమప్రసాద్, ఎస్ఐ రామ్మోహన్, ఐఈఆర్టీ టీచర్లు వాణి, బబిత, మహిళా పోలీస్ పావని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన ఉద్యోగికి సన్మానం

తవణంపల్లె: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్ఎన్‌గా విధులు నిర్వర్తిస్తున్న భారతి పదవీ విరమణ పొందడంతో గురువారం వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. తవణంపల్లె మండల పబ్లిక్ హెల్త్ నర్సు(పీహెచ్ఎన్)గా నాలుగేళ్లుగా విధులు నిర్వహించారు. ఈ నెల 31వ తేదీతో ఆమె ఉద్యోగం ముగుస్తుంది. ఈ నేపథ్యంలో తవణంపల్లె వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ కేశవనారాయణ శాలువాలు కప్పి పూల దండలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గంగవరం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు, తుంబకుప్పం వైద్యాధికారి డాక్టర్ రమేష్, వైద్యాశాఖ యూనియన్ నాయకులు, తవణంపల్లె వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొని ఘనంగా వీడ్కోలు పలికారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగర, మండల ప్రాంతాల్లోని ఎరువులు, విత్తన, పురుగు మందుల దుకాణాలను వ్యవసాయశాఖ అధికారులు తనిఖీ చేశారు. పుంగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్, తవణంపల్లి వ్యవసాయశాఖ అధికారి ప్రవీణ్, చిత్తూరు మండల వ్యవసాయశాఖ అధికారి వేణుగోపాల్ కలిసి పలు దుకాణాలపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో పలు లోపాలను గుర్తించారు. ప్రధానంగా కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వడం లేదని గుర్తించారు. ప్రతి రైతుకు కచ్చితంగా బిల్లులు ఇవ్వాలని నిర్వాహకులకు ఆదేశించారు. గడువు తీరిన మందులు, ఎరువులు విక్రయించరాదని హెచ్చరించారు. ఇక అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని సూచించారు. తనిఖీలో భాగంగా సత్యం ఎరువుల దుకాణంలో జీరో ఫామ్ లేని కారణంగా 48 కేజీల బయో ఫెర్టిలైజర్ స్టాక్‌ను నిలుపుదల చేశారు. దీని విలువ రూ.8,400 ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు.

పాడితో జీవనోపాధి



దూడకు నట్టల నివారణ మందు తాగిస్తున్న డాక్టర్ పినాకపాణి

ఐరాల: పాడి కుటుంబానికి జీవనోపాధిని ఇస్తుందని, పాడి రైతులు అప్రమత్తంగా ఉంటూ పశువులకు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మద్దిపట్లపల్లె పశువైద్య సహాయ శస్త్ర చికిత్స డాక్టర్ పినాకపాణి సూచించారు. గురువారం మండలంలోని వడ్రాంపల్లె, చినకాంపల్లె గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పశువులు, జీవాల సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. సీజనల్‌గా ఆవులు, ఎద్దులు, జీవాల్లో వ్యాపించే వ్యాధుల నివారణకు ఉచితంగా ఇస్తున్న టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు.

స్పందనకు మంగళం

గ్రామ సచివాలయాల పరిధిలో పరిపాలనా సౌలభ్యంలో భాగంగా ఆ నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రతి రోజూ స్పందన కార్యక్రమానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. గ్రామ సచివాలయాల్లో ఎక్కడా దాని ఆనవాళ్లు కనిపించకపోవడమే ఇందుకు నిదర్శనం. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అధికారులంతా ప్రజలకు జవాబుదారీగా ఉండాలంటూ, ప్రతి రోజూ స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ కార్యక్రమాన్ని నిర్వహించక పోవడం విమర్శలకు తావిస్తోంది.

–బంగారుపాళెం



మండల కేంద్రంలో స్పందన (ఫైల్)



మొగిలివారిపల్లె గ్రామ సచివాలయం

- గ్రామస్థాయి సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేసిన జగన్ ప్రభుత్వం
- ప్రతిరోజూ స్పందన కార్యక్రమంపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు

స్పందన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరిపై అయినా ఫిర్యాదు చేసేందుకు ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రతి రోజూ సాయంత్రం మూడు గంటల నుంచి నాలుగు గంటల వరకు వీలుండేది. ఆ సమయంలో పంచాయతీ కార్యదర్శులతోపాటు, సచివాలయంలో అధికారులందరూ ఈ స్పందన కార్యక్రమానికి హాజరయ్యేవారు. గ్రామంలో ఏ విధమైన సమస్యలు ఉన్నా స్థానికంగా ప్రతిరోజూ గంట పాటు నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు ఫిర్యాదులు చేసి, సమస్యలను వెంటనే పరిష్కరించుకునేవారు. గ్రామంలోనే స్పందన కార్యక్రమం ఏర్పాటు చేయడంతో ప్రజలకు దూరాభారం, ఆర్థిక ఇబ్బందులు, సమయం వృథా కాకుండా అనుకూలంగా ఉండేది. జీవనోపాధి కోసం వివిధ పనులకు వెళ్లే గ్రామీణ ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో మండల స్థాయిలో నిర్వహించే స్పందనకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ప్రజలకు మళ్లీ కష్టాలను తీసుకువచ్చింది. గ్రామ స్థాయిలో ప్రతి రోజూ గంట పాటు జరిగే స్పందన కార్యక్రమంపై చిన్నచూపు చూడడంతో ప్రజలు మండల స్థాయి స్పందనకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. దీనిపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే గ్రామ స్థాయిలోనే స్పందన కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే వృద్ధులు, మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని అంటున్నారు. ఆయా గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తోంది. పూతలపట్టు నియోజకవర్గంలో బంగారుపాళెం, యాదమరి, తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు మండలాలలో 98 గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి గత ప్రభుత్వం ప్రజలకు ఉత్తమ సేవలు అందించింది. ఆయా గ్రామ సచివాలయాల్లో 980 మంది ఉద్యోగులు సేవలు అందిస్తున్నారు.

నియోజకవర్గంలో సచివాలయాలు	
బంగారుపాళెం మండలం	27 సచివాలయాలు
యాదమరి మండలం	18 సచివాలయాలు
తవణంపల్లె మండలం	17 సచివాలయాలు
ఐరాల మండలం	19 సచివాలయాలు
పూతలపట్టు మండలం	17 సచివాలయాలు

పేరుకుపోతున్న సమస్యలు

ఆయా గ్రామాల్లోని సమస్యలను అధికారులకు విన్నవించేందుకు ప్రజలు మండల కేంద్రాలకు రావాల్సి ఉండడంతో చాలా మంది బాధితులు, ప్రజలు ఇబ్బందులు పడి, సమస్యలు చెప్పలేకపోతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. ప్రస్తుతం మండల కేంద్రాల్లోనే స్పందన కార్యక్రమాన్ని వారానికోసారి నిర్వహిస్తున్నారు.

గ్రామ స్థాయి స్పందన కొనసాగించాలి

ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని వెంటనే గ్రామ స్థాయిలో స్పందన కార్యక్రమాన్ని కొనసాగించాలి. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించుకునేలా గ్రామ సచివాలయాల్లో గత ప్రభుత్వం మాదిరిగానే ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలి.

–నరసింహులు, కీరమంద

ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు

మండల కేంద్రాల్లో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి రావాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు అవస్థలు పడుతున్నారు. వారి కష్టాలు చెప్పుకునేందుకు గత ప్రభుత్వం అద్భుతంగా గ్రామాల్లోనే స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు కూడా దానిని పూర్తిస్థాయిలో కొనసాగించాలి.

–సుబ్రమణ్యం, సర్పంచ్ వెలుతురుచేను

జంతువులను హింసించకూడదు



విద్యార్థినులకు బహుమతుల పంపిణీ

తవణంపల్లె: జంతువులను క్రూరంగా హింసించడం మంచిదికాదని తవణంపల్లె పశు వైద్యాధికారి డాక్టర్ లావణ్య తెలిపారు. జంతు సంక్షేమ పక్షోత్సవాలను పురస్కరించుకొని గురువారం మండల కేంద్రమైన తవణంపల్లె హైస్కూల్లో సమాజంలో జంతు సంక్షేమ కార్యకలాపాల ప్రాముఖ్యత, రోజువారీ జీవితంలో ఎస్‌పీసీఏ కార్యకలాపాల పాత్రపై విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యం కోసం ప్రత్యేక శిబిరాలు



పశువైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్లు

గుడిపాల: పశువైద్య శిబిరాలతోనే పశువులు ఆరోగ్యంగా ఉంటాయని పశు వైద్యాధికారులు రవితేజ, సాయిసుధ అన్నారు. గురువారం గుడిపాల మండలంలోని రెట్టగుంట, పేయనపల్లెలో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులు ఆరోగ్యంగా ఉంటేనే మంచి పాల దిగుబడి సాధ్యమవుతుందన్నారు. అనంతరం 209 పశువులకు వైద్యం చేశారు. ప్రస్తుతం లంపీస్కిన్ వ్యాధి అధికంగా సోకుతుందని, అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు.

హృదయ రక్షపై అవగాహన



బంగారుపాళెం: రోగులకు హృదయ రక్ష కార్యక్రమంపై అవగాహన

బంగారుపాళెం: గుండె జబ్బు బాధితులు హృదయ రక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బంగారుపాళెం సామాజిక ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష అన్నారు. గురువారం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో హృదయ రక్షపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుండె నొప్పితో ఆసుపత్రికి వచ్చే వారికి వెంటనే ఈసీజీ పరీక్ష నిర్వహిస్తారన్నారు. గుండె నొప్పి ఉందని నిర్ధారణ అయితే గంటలోపే వారికి రక్తం గడ్డ కట్టకుండా ఉండటానికి రూ.45 వేల విలువైన టెనిక్‌ప్లేస్ అనే ఇంజక్షన్ వేస్తామన్నారు. తదుపరి వైద్యం కోసం డాక్టర్ల వద్దకు చేరుకునేంత వరకు ప్రాణాపాయం ఉండదన్నారు. డాక్టర్లు విజయకుమారి, శాలిని, స్వరూప్ నాయక్, భార్గవ్, రాగభావన పాల్గొన్నారు.

అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు



అవగాహన కల్పిస్తున్న డీఆర్‌ఓ రాకేష్‌కుమార్

ఐరాల: అడవికి నిప్పు పెడితే మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందని మండల అటవీ శాఖాధికారి రాకేష్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని చుక్కావారిపల్లె, పొలకల యల్లంపల్లె ఎస్టీ కాలనీలో ఆయన సిబ్బందితో కలిసి అడవికి నిప్పు పెడితే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ అడవులను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అన్నారు. అడవిలో తేనె తీసేందుకు నిప్పు పెట్టి వదిలేయడం, బీడీ, సిగరెట్లు కాల్చి నిర్లక్ష్యంగా పడేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం నిప్పు పెట్టడం నిషేధించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా అడవిలో నిప్పు పెడితే అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ హామీల అమలు ఎప్పుడు బాబూ..



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, జిల్లా మాజీ మహిళా అధ్యక్షురాలు గాయత్రీదేవి

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు ఎప్పుడు చేస్తారు బాబూ అని డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, జిల్లా మాజీ మహిళా అధ్యక్షురాలు గాయత్రీదేవి విమర్శించారు. గురువారం స్థానిక వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో నాయకులతో కలిసి ప్లకార్డులు చూపుతూ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అయినా హామీలు అమలు చేయలేమని నిస్సిగ్గుగా ప్రకటించిన చంద్రబాబు ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రజలపై రూ.15 వేల కోట్ల విద్యుత్ భారాలు పెంచారని గుర్తు చేశారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ విలువలను సైతం పెంచారన్నారు. సంపద అంటే ప్రజలపై పన్నుల భారాలు మోపడమా అని ప్రశ్నించారు. హామీల పేరిట మహిళలను మోసం చేశారన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణాలు ఎక్కడ అని ప్రశ్నించారు. పవన్‌కల్యాణ్ కూడా ఆంధ్రప్రదేశ్ శ్రీలంకలా తయారవుతుందని డ్రామాలు ఆడించారని, ఈ విషయం ప్రజలకు అర్థమైందన్నారు. నాయకులు జ్ఞానజగదీష్, కేపీ శ్రీధర్, రాసనపల్లె ప్రకాష్, రజనీకాంత్, మధుసూదన్, జెడ్పీటీసీ బాబునాయుడు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్‌రెడ్డి, మధురెడ్డి, లక్ష్మణస్వామి, దేవరాజులు, చల్లాముత్తు, త్యాగరాజులు, నారాయణ, ఉన్నికృష్ణన్, న్యాయవాది సూరి, సుగుణశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న జేసీ విద్యాధరి

గుడిపాల: చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నూతన నిర్మాణంలో భాగంగా ఓ రైతుకు సంబంధించి నష్టపరిహారం అందకపోవడంతో జేసీ విద్యాధరి గురువారం ఆ భూమిని పరిశీలించారు. ఆ భూమిలోని మామిడిచెట్లను రెవెన్యూ అధికారులు గత వారం క్రితం తొలగించారు. దీంతో ఆ రైతు హైకోర్టుకు వెళ్లడంతో అతని భూమిని పరిశీలించి నివేదికలు పరిశీలించాలని ఆదేశించింది. దీంతో గురువారం కమ్మతిమ్మాపల్లె పంచాయతీ చలిచీమలపల్లె గ్రామానికి చెందిన రైతు సుబ్రమణ్యంనాయుడు పొలాన్ని ఆమె పరిశీలించారు. ఆర్డీఓ శ్రీనివాసులు, గుడిపాల తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి రైతు సుబ్రమణ్యంనాయుడుకు సంబంధించిన భూమిని సర్వే చేయించి, నివేదికలను జాయింట్ కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

రోడ్డును నిర్మించండి: చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవేలో రోడ్డు పనులు చేస్తుండడంతో వ్యవసాయం చేసుకుంటున్న తమకు రోడ్డు లేదని సుమారు 300 ఎకరాల భూమికి రోడ్డు సౌకర్యం చూపించాలని జేసీ విద్యాధరిని రైతులు కోరారు. ఆమె స్పందించి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ సావిత్రికి సూచించారు. ఆర్ఐ రమాసాయి, సర్వేయర్ గోపి, వీఆర్‌ఓ మల్లికార్జున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్

దాడి చేస్తున్నారు... రక్షణ కల్పించండి



గుణశేఖర్ నాయుడు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): భూ విషయంలో తమ కుంటుంబంపై కక్ష కట్టి దాడి చేయిస్తున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాలని బంగారుపాళ్యం మండలం సీజీఎఫ్ కాలనీకి చెందిన కఠారి గుణశేఖర్ నాయుడు కోరారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగేళ్లుగా 5.50 ఎకరాల భూమికి సంబంధించి తమ కుటుంబానికి, కఠారి గిరీష్, చంద్రమ్మ, తులసిరామ్ అనే వ్యక్తులకు మధ్య భూ సమస్య నడిచిందన్నారు. ఆ భూమికి సంబంధించి ఇంజెక్షన్ ఆర్డర్ తమకు అనుకూలంగా వచ్చిందని తెలిపారు. దీని జీర్ణించుకోలేని ఆ వ్యక్తులు తన అక్కపై దాడి చేశారన్నారు. దీనిపై బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారించారన్నారు. అయితే గత శనివారం తమ కుటుంబ సభ్యులపై వారు, వారి అనుచరులు రాడ్లు, కత్తులతో దాడి చేశారని తెలిపాడు. రక్త గాయాలతో ఆసుపత్రిలో చేరితే తమకు సరైన న్యాయం జరగడం లేదని వాపోయాడు. గిరీష్ నుంచి తమ కుంటుంబానికి హాని ఉందని, ఎస్పీ స్పందించి ప్రాణ రక్షణ కల్పించాలని పేర్కొన్నాడు.

మహాత్ముడికి ఘన నివాళి



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్, కమిషనర్



గాంధీజీకి నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్, గాయత్రీదేవి

చిత్తూరు అర్బన్: మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్ నివాళులర్పించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి సైతం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి లోకేష్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

గాంధీజీకి నివాళి

చిత్తూరు కార్పొరేషన్: జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మాజీ జిల్లా మహిళ అధ్యక్షురాలు గాయత్రీదేవీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు జ్ఞానజగదీష్, కేపీ శ్రీధర్, రాసనపల్లె ప్రకాష్, మధుసూదన్, జెడ్పీటీసీ బాబునాయుడు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్‌రెడ్డి, ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులు మధురెడ్డి, లక్ష్మణస్వామి, దేవరాజులు, చల్లాముత్తు, త్యాగరాజులు, నారాయణ, ఉన్నికృష్ణన్, న్యాయవాది సూరి, సుగుణశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సెంట్రల్ లెప్రసీ డివిజన్ అధికారుల పర్యటన

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిల్లాలో శుక్రవారం సెంట్రల్ లెప్రసీ డివిజన్ అధికారులు పర్యటించనున్నారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటప్రసాద్ తెలిపారు. వారు జిల్లాలో జరుగుతున్న కుష్టు వ్యాధి సర్వే, పీహెచ్‌సీలలో రికార్డులు, కుష్టు వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలపై పరిశీలిస్తారన్నారు. రెండు పీహెచ్‌సీలు, రెండు విలేజ్ హెల్త్ క్లినిక్‌లను కూడా తనిఖీ చేయనున్నారన్నారని, అనంతరం జిల్లా కేంద్రానికి రానున్నారని ఆయన పేర్కొన్నారు.



జాగ్రత్తలతో కుష్టు వ్యాధి నిర్మూలన



గుడిపాల: కుష్టువ్యాధిపై బొమ్మసముద్రంలో సర్వేచేపడుతున్న డాక్టర్ రష్మిత



బంగారుపాళెంలో అవగాహన ర్యాలీ

గుడిపాల: గ్రామాల్లో కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నివారణ సర్వేలో భాగంగా గురువారం బొమ్మసముద్రంలో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తూ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 2 వరకు కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

గాంధీజీ వర్ధంతి ర్యాలీ

గాంధీజీ వర్ధంతి సందర్భంగా గురువారం గుడిపాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో డాక్టర్లు సంధ్య, రష్మిత ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ లెప్రసీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించామన్నారు. కుష్టు వ్యాధి ఒక బ్యాక్టీరియా ద్వారా వస్తుందన్నారు. కార్యక్రమంలో విజయ, సెల్వి, అనురాధ, అనూష, వెంకటేష్, చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజానికి కృషి

బంగారుపాళెం: కుష్టు రహిత సమాజానికి కృషి చేద్దామని తుంబకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్ రాయస్ అన్నారు. గురువారం నివారణపై బంగారుపాళెంలో ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి లక్షణాలు, వ్యాధి ఎలా వస్తుంది, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలోసీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష, డాక్టర్ రమేష్, డిపిఎం మణి, ఏపిఎంఓ హరికృష్ణ, ఎంపిహెచ్ఈఓ రమేష్‌బాబు, అముద, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజాన్ని స్థాపిద్దాం

ఐరాల: కుష్టు వ్యాధి రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం పీహెచ్‌సీలో జాతీయ కుష్టు వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 3వ తేదీ వరకు కుష్టు వ్యాధి నిర్మూలనపై పీహెచ్‌సీ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన వైద్య సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఎల్‌డీసీ ఉమాపతి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

స్పర్శలేని మచ్చలు ఉంటే కుష్టుగా నిర్ధారణ

తవణంపల్లె: స్పర్శలేని మచ్చలను కుష్టుగా నిర్ధారించవచ్చునని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ మణి తెలిపారు. గురువారం టి.పుత్తూరులో అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ రవిచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీపీఎంఓ మణి విచ్చేశారు. నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సర్వేలో భాగంగా తెల్లమచ్చలు, స్పర్శలేని మచ్చలు గుర్తించి పీహెచ్‌సీలో నివేదిక ఇస్తే పరీక్షలు చేస్తామన్నారు. నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి మాట్లాడుతూ టి.పుత్తూరులో వారం రోజులు పాటు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛభారత్, స్కూల్ హెల్త్ ప్రోగ్రాం, హెల్త్ క్యాంపు, ఓటు హక్కు, పౌష్టికాహారంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు సమష్టి కృషి

చిత్తూరు రూరల్: కుష్టు వ్యాధి నివారణకు సమష్టిగా పని చేద్దామని జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ పిలుపునిచ్చారు. చిత్తూరు నగరం కాజూరులోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం గాంధీ వర్ధంతిని నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. కుష్టు సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంఓ అనిల్‌కుమార్, ఎపిడిమాలజిస్ట్ శ్రీవాణి, వైద్యాధికారి సాయి షర్మిల, డీపీఎంఓ రవి, జాన్ తదితరులు పాల్గొన్నారు.

యాదమరి మండలంలో...

మాదిరెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, సిబ్బంది కలిసి గ్రామంలో కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా సర్వే చేశారు. మెడికల్ ఆఫీసర్ శివప్రసాద్, ఈశ్వరమ్మ, రాజు విజయలక్ష్మీ పాల్గొన్నారు.